క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

అయిజ: మాజీ ఎంపీపీ ఉత్తనూరు తిరుమల్‌రెడ్డి 60వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్‌ నాయకుడు సంకాపురం రాముడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కర్తదాన శిబిరం కార్యక్రమం ప్రారంభించనున్నట్లు చెప్పారు.

రమాబాయికి ఘన నివాళి



అయిజ: మండల కేంద్రంలో సోమవారం అంబేడ్కర్‌ విగ్రహం ఎదుట వివిధ సంఘాల, పార్టీల నాయకులు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సతీమణి రమాబాయి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు మాట్లాడారు. రమాదేవి తమ భర్త అంబేడ్కర్‌ అడుగుజాడల్లో నడిచిందని, ఆయన చేసే పనులకు తనవంతు సాయం చేసిందని కొనియాడారు.

భక్తిశ్రద్ధలతో దేవర ఉత్సవాలు



అయిజ: మండలంలోని దేవబండలో సోమవారం ఉలిగమ్మ, పరశురాముడు దేవతా మూర్తుల ఉత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పాశం కాగును ఆలయ పూజారి వెంకటేష్‌ ఇంటి నుంచి దేవాలయం వరకు ఊరేగించారు. అనంతరం అగ్ని గుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలను ఆలయ పూజారి ఆధ్వర్యంలో భక్తులు సంప్రదాయపరంగా నిర్వహించారు. ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భోజన వసతి కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

జేసీబీ బోల్తా



కేటీదొడ్డి: ప్రమాదవశాత్తుగా జేసీబీ గుంతలోకి దుసుకెళ్లి బోల్తా పడిన సంఘటన మండల కేంద్రంలోని బస్టాండ్‌ శివారులో సోమవారం చోటుచేసుకుంది. డ్రైవర్‌ ముందుగానే కిందకు దూకడంతో ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. జేసీబీకి ముందు భాగంలోని గ్లాసు మాత్రం పగిలినట్లు తెలియజేశారు.

నేడు సవారమ్మ జాతర



అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవారమ్మ బోనాల జాతర ఉత్సవం మంగళవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం దేవాలయం ముందు పచ్చని పందిరి వేసి అమ్మవారికి కృష్ణ జలాలతో అభిషేకించి ప్రత్యేక పూజలను చేశారు. మంగళవారం వేకువ జామున అమ్మవారికి అభిషేకాలతో పాటు బోనాలను సమర్పించి పూజలు నిర్వహించి భక్తుల దర్శనార్థం అమ్మవారి విగ్రహాన్ని అలంకరించనున్నట్లు తెలిపారు. భక్తులు బోనాలు, కోళ్లను బలిచ్చి తమ మొక్కులను చెల్లించుకుంటారని, ఇది ఆనవాయితీ అని కమిటీ సభ్యులు తెలిపారు.

గాలివాన బీభత్సం.. కూలిన ప్రహరీ

నర్వ: మండలంలోని ఎల్లంపల్లిలో గాలివాన బీభత్సానికి పాఠశాల ప్రహరీ కూలినట్లు హెచ్‌ఎం వెంకటన్న తెలిపారు. భారీ వర్షానికి పాఠశాల ఆవరణలో ఉన్న వేపచెట్టు వేళ్లతో సహా కూలి ప్రహరీపై పడిందన్నారు. దీంతో పాఠశాల రక్షణ ప్రహరీ పూర్తిగా కూలిపోయిందని వాపోయారు. విషయంపై సోమవారం పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు.



పాఠశాలలకు రక్షణ కరువు

- నైట్‌ వాచ్‌మెన్‌ లేకపోవడంతో భద్రత లేదు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..
- సెలవిస్తే మందుబాబులకు నిలయం



ముండ్లదిన్నెలో ఎన్నికల ముందు రోజు చోరీకి గురైన కిటికీ(ఫైల్‌)

రాజోళి: విద్యార్థులకు బంగారు భవిష్యత్‌ను అందించే విద్యానిలయాలకు రక్షణ లేకుండా పోతోంది. విద్యానిలయాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. రాత్రి అయితే చాలు ఆకతాయిల ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. సిగరెట్‌ నుంచి మొదలుకుని మద్యం సీసాల వరకు పాఠశాల పరిసరాల్లో దర్శనమిస్తున్నాయి.

సెలవు వచ్చిందంటే..

పాఠశాల పనిరోజుల్లో సాధారణ పరిస్థితులే ఉన్నప్పటికీ, రాత్రి కాగానే సిగరెట్లు మద్యం సీసాలు పాఠశాల గదుల్లో పడేసి వెళ్లేవారు. ప్రస్తుతం కండోమ్‌ ప్యాకెట్లు పడేస్తుండటంతో పరిస్థితి మరింత దిగజారుతోంది.

పర్యవేక్షణ శూన్యం..

ఇంత జరుగుతున్నా ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. రాజోళి గ్రామ పంచాయతీ పరిధిలోని తుమ్మలపల్లె ప్రభుత్వ పాఠశాల ప్రధాన రోడ్డుకు పక్కనే ఉంటుంది. అందులో తరుచూ కండోమ్‌ ప్యాకెట్లు పడుతుండడం చర్చనీయాంశంగా మారింది. నిత్యం ప్రజలు తిరుగతూ రద్దీగా ఉండే చోటనే ఇలాంటి పరిస్థితి ఉంటే, మారుమూల గ్రామాల్లో పాఠశాలల పరిస్థితి ఏంటో అర్థమవుతోంది. తెల్లవారితే ఎంపీ ఎన్నికలు ఉండగా, ఎన్నికల బూతుకు కేటాయించిన పాఠశాల కిటికీని తీసుకెళ్లిన ఘటన ముండ్లదిన్నెలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఇంతవరకు ఎవరిపై చర్యలు తీసుకున్నారో కూడా తెలియదు. భవనం నిర్మాణానికి సంబంధించిన విభేదాల కారణంగా ఇది జరిగిందని ఆరోపణలు ఉన్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాల భవనానికి కిటికీ తొలగించడం, ఎన్నికల సమయంలో కావడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది. దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో స్పష్టత లేదని గ్రామస్తులు అంటున్నారు.

నైట్‌ వాచ్‌మెన్లు లేకపోవడంతో..

మండలంలోని చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఆకతాయిల చేతిలో ఫర్నీచర్‌ ధ్వంసం, అసాంఘిక కార్యక్రమాలతో పరిసరాలు అపరిశుభ్రం, భవనాల తలుపులు, కిటికీలు, గేట్లు, బెంచీలు విరిగిపోతున్న పట్టించుకునే వారు లేరు. పాఠశాలల వద్ద నైట్‌ వాచ్‌మెన్లు లేకపోవడంతో కనీస పర్యవేక్షణ కరువైంది. అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన తుమ్మలపల్లె పాఠశాల

ఫిర్యాదులు చేస్తున్నాం..



మండలంలో పలు పాఠశాలల్లో ఇలాంటి ఘనటలు చోట చేసుకుంటున్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పాఠశాలలు మారుతున్నాయి. మా దృష్టికి రాగానే పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నాం. గతంలో పలు చోట్ల ఇలాంటి ఘటనలపై ఫిర్యాదు చేశాం. స్థానికులు బాధ్యతగా వ్యవహరించాలి. అలాంటి పనులకు పాల్పడుతున్న వారిని చూసి చెప్పకపోవడం వల్ల దుండగులు సులువుగా తప్పించుకోవడమే కాకుండా, మళ్లీ అదే తప్పు చేస్తున్నారు. దీనిపై అందరూ బాధ్యత కలిగి చైతన్యంతో ముందుకు వస్తే అలాంటి ఘటనలు తగ్గించవచ్చు.

– నర్సింహ, ఎంఈఓ, రాజోళి

చర్యలు తీసుకుంటాం..



పాఠశాలల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా మా దృష్టికి తీసుకురావాలి. మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఆకతాయిలపై కేసులు నమోదు చేస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు కలిగితే ఎవరిని ఉపేక్షించేది లేదు.

– జగదీశ్వర్, ఎస్‌ఐ, రాజోళి

బడిఈడు పిల్లలు పాఠశాలకు వచ్చేలా చూడాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ నరసింహ

శాంతినగర్: వచ్చే విద్యాసంవత్సరంలో బడిఈడు పిల్లలందరూ పాఠశాలలకు వచ్చేలా చూడాలని మండల విద్యాధికారి నరసింహ అన్నారు. వడ్డేపల్లి మండల స్థాయి కిశోర బాలికల సమావేశం ఎంవీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికల సంఘాల వారితో ఎంఈఓ మాట్లాడారు. ఉన్నత చదువులు, బాల్యవివాహాలు, మొబైల్‌ ఫోన్లు సరియైన పద్ధతిలో వాడుకొనుట, గుడ్‌ టచ్, బ్యాడ్‌ టచ్, జండర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఎంవీ ఫౌండేషన్‌ మండల కోఆర్డినేటర్‌ హనిమిరెడ్డి మాట్లాడారు. ప్రతి నెలా సమావేశాలు పెట్టుకొని అందరూ భాగస్వాములై సమస్యలపై చర్చించుకోవాలన్నారు. బాల్యవివాహాలు జరిపిస్తే కలిగే నష్టాలను వివరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామేల్, నాగేషన్, ఎంవీఎఫ్‌ సభ్యులు కేబీఎస్‌ బాలికలు పాల్గొన్నారు.

సాధారణ కాన్పులపై అవగాహన

మానవపాడు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు వీణసాయి తెలియజేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు నార్మల్‌ డెలివరీలపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు పాలు, మాంసం, గుడ్లు, చేపలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ చంద్రన్న, ఫార్మాసిస్ట్‌ తిరుమల్‌రావు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో గర్భిణులకు సూచనలు ఇస్తున్న వైద్యసిబ్బంది

తిరుమలలో సంకాపురం భజన మండలి



స్వామివారి సంకీర్తనలు ఆలపిస్తున్న విజయరాయ భజన మండలి సభ్యులు

అయిజ: తిరుమలలో స్వామివారి సన్నిధిలో తిరుమల తిరుపతి దవస్థానం వారు నిర్వహిస్తున్న అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో సోమవారం మండలంలోని సంకాపురానికి చెందిన విజయరాయ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన కమిటీ ఆహ్వానం మేరకు ప్రతి సంవత్సరం తిరుమలలో నిర్వహించే హరినామ సంకీర్తన కార్యక్రమంలో సంకాపురం విజయరాయ భజన మండలి పాల్గొనడం ఆనవాయితీగా వస్తోందని భజన మండలి సభ్యులు తిలిపారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు వెంకటేష్, ఉరుకుంద, పెద్ద తిమ్మప్ప, నరసింహులు, వెంకట్రాములు, చిన్న, తిమ్మప్ప, నర్సిహచారి, రామలింగం, రాముడు, నర్సన్న, నాగరాజు, పవన్, నరసింహులు, వీరేశఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పశువుల వ్యాక్సినేషన్‌ ప్రక్రియ



ధరూరులో పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

ధరూరు: పశువులకు ఇచ్చే వ్యాక్సినేషన్‌ ప్రక్రియ మండలంలో వేగవంతంగా కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఉప్పేరు, మన్నాపురం గ్రామాల్లో మండల పశు వైద్యాధికారి శంకరయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పశువులకు గొంతు వాపు, జబ్బ వాపు నివారణ టీకాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి గ్రామంలో తమ సిబ్బంది పశువులకు టీకాలు వేస్తున్నారని, రైతులు తమ పశువులకు వ్యాకినేషన్‌ చేయించుకోవాలని సూచించారు. వ్యాక్సినేషన్‌ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలన్నదే లక్ష్యమన్నారు. వెటర్నరీ డాక్టర్‌ శంకరయ్య, జేవీఓ శ్రీధర్, వీఏలు ముస్తాక్, మురళి, ఓఎస్‌లు పవన్‌కుమార్, రషీద్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

పశుసంపదతో ఆర్థికాభివృద్ధి



గేదెకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

శాంతినగర్: వ్యవసాయానికి పశుసంపద తోడుంటే ఆర్థికాభివృద్ధి సాధ్యమని శాంతినగర్‌ పశువైద్యశాల డాక్టర్‌ పుష్పలత అన్నారు. సోమవారం వడ్డేపల్లి మండల పరిధిలోని తనగలలోని పశువులకు జబ్బవాపు, గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వరప్రసాద్, లతీఫ్, రవికిరణ్‌ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పశువుల టీకాలు

అయిజ: పశువులకు వ్యాధులు రాకుండా నివారించేందుకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం మండలంలోని బైనిపల్లిలో 60 పుశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాధినిరోధక టీకాలు వేశారు. పుశువులకు గురుక వ్యాధి, జబ్బ వాపు వ్యాధులు రాకుండా ఉండేందుకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్‌ సర్జన్‌ స్వరూప రాణి తెలియజేశారు.

రోడ్ల వెంట పచ్చదనం



జూరాల డ్యాం వెళ్లే రోడ్డులో మన్నాపురం వద్ద రోడ్లకు ఇరువైపులా పచ్చగా కనిపిస్తున్న చెట్లు

- పంట పొలాలకు నీడ వస్తుందని భావించి చెట్లను నరికేందుకు రైతుల కసరత్తు
- కొరవడిన సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ

ధరూరు: మొన్నటి వరకు రోడ్ల వెంట ఉన్న చెట్ల ఆకులు రాలి కళాహీనంగా కనిపించాయి. వారం రోజుల్లో మండలంలో రెండు భారీ వర్షాలు కురవడంతో రోడ్ల వెంట పచ్చదనం కనువిందు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మొక్కలు నాటారు. అవి పెద్దవిగా మారి రోడ్ల వెంట వాహనదారులకు నీడ నివ్వడంతో పాటు రోడ్లకు కొత్త అందాలను తెచ్చి పెడుతున్నాయి. మండల పరిధిలోని ధరూరు– మన్నాపురం వయా జూరాల డ్యాం, పారుచర్ల స్టేజీ టూ చిన్నపాడు, సోంపురం గ్రామాలు అలాగే ధరూరు– మార్లబీడు గ్రామాల వెంట ఉన్న చెట్లు ఏపుగా పెరిగి రోడ్లకు కొత్త అందాలను తెస్తున్నాయి. వారం రోజుల కిందటి వరకు మునుపెన్నడూ లేని విధంగా విపరీతమైన ఎండలకు అక్కడిక్కడే చెట్లు ఎండిపోయాయి. నీటి ట్యాంకర్‌ ద్వారా కొంత వరకు మొక్కలు కాపాడినప్పటికీ పూర్తి స్థాయిలో మొక్కలు పెరగలేదు. కాస్త పెద్దవిగా ఉన్న చెట్లను రోడ్ల వెంట ఉన్న రైతులు తమ పంట పొలాలకు నీడ వచ్చి దిగుబడి తగ్గుతుందని భావించి నరికేసే పనులకు శ్రీకారం చుడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇలా చేసే వారిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రిటైర్డ్‌ లైన్‌మెన్‌ మృతికి సంతాపం

గట్టు: మండల పరిధిలోని మాచర్లకి చెందిన రిటైర్డ్‌ లైన్‌మెన్‌ మహ్మద్‌ రఫీ(70) సోమవారం ఉదయం మృతిచెందాడు. విద్యుత్‌ శాఖలో లైన్‌మెన్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన తర్వాత మాచర్లలోనే నివాసం ఉండేవారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్‌లు సిద్ధిరామప్ప, వరలక్ష్మి, కాంగ్రెస్‌ నాయకుడు వెంకటస్వామిగౌడ్‌ తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలియజేశారు. గట్టు, ఆలూరు, మాచర్ల, గొర్లఖాన్‌దొడ్డి విద్యుత్‌ సబ్‌స్టేషన్లలో పని చేస్తున్న ఆపరేటర్లు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్‌ కోతలతో సతమతం



ఉండవెల్లి ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉండవెల్లి: ప్రతిరోజూ వంట చేసుకుంటున్న సమయంలో కరెంట్‌ కోతలు అధికంగా ఉన్నాయి. మండల సర్వసభ్య సమావేశంలో అడుగుదామనుకుంటే అధికారులు మారుతున్నారు. ఎవరిని అడగాలో.. ఎలా పరిష్కరించాలో తెలియట్లేదని ఎంపీపీ బీసమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీడీఓ అబ్దుల్‌ జబ్బార్‌ హాజరయ్యారు. మొదటగా సభలో వ్యవసాయ అధికారి సురేఖ మాట్లాడారు. వర్షాకాలంలో పంటల నమోదుపై ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు ప్రారంభించామన్నారు. మండలానికి 20 క్వింటాళ్ల జీనుగ విత్తనాలు వచ్చినట్లు చెప్పారు. అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని తెలియజేశారు. ఈదురు గాలులు లేకున్నా.. కరెంటు తీసేస్తున్నారని ఎంపీపీ తెలియజేయడంతో ఏఈ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. మిషన్‌ భగీరథ నీటిపై సమీక్ష నిర్వహించగా.. ఏఈ అర్షద్‌ మాట్లాడారు. ప్రతి గ్రామంలో నీటి బోర్లకు మరమ్మతు చేయిస్తున్నామన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారి శిరీషా మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి వీఎల్‌ఓ, వీఎస్‌లు అందుబాటులో ఉంటూ పశువులకు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్‌ సలీముద్దీన్‌ మాట్లాడుతూ.. జూన్‌ 6 తరువాత రేషన్‌కార్డుల జారీ ఉంటుందని తెలిపారు. మొదటి వివాహ పత్రంపై పంచాయతీ కార్యదర్శి సంతకం చేయాలని కోరగా.. మాకు ఉత్తర్వులు రాలేదని మేము చేయలేవని తెలపడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. తరువాత మండల విద్యాధికారి శివప్రసాద్‌ మాట్లాడుతూ.. విద్యా శాఖ నుంచి అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించి అందులో మన మండలానికి రూ.36.34 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ పద్మావతి, వైస్‌ ఎంపీపీ దేవన్న, ఎంపీటీసీలు సుంకన్న, కురుమూర్తి, చిన్నబాస్‌ మియ్యా, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి దేవదాస్‌

అలంపూర్‌ రూరల్: ఉపాధి కూలీలకు రూ.600 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెపల్లే దేవదాస్‌ డిమాండ్‌ చేశారు. మండల పరిధిలోని లింగన్‌వాయిలోని ఉపాధి కూలీలను సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెపల్లే దేవదాస్, మండల కార్యదర్శి బి.నర్సింహులు ఉపాధి పనులను పరిశీలించి అక్కడి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏడాదిలో 200 రోజుల పనిదినాలను కూలీలకు కల్పించాలని, వారికి పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలను కల్పించాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు అవసరం



బోయలగూడెంలో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ



వడ్డేపల్లి మండలం బుడమొర్సులో రైతులకు సూచనలిస్తున్న ఎంఏఓ రాధ

గట్టు: విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్త వహించాలని వ్యవసాయ విస్తర్ణ అధికారులు భక్తవత్సల, తోహిద్‌ రైతులకు సూచించారు. సోమవారం బోయలగూడెం, గట్టు గ్రామాల్లో వ్యవసాయ విస్తర్ణ అధికారులు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బోయలగూడెం, గట్టు ఏఈఓలు మాట్లాడారు. రైతులు వ్యవసాయ సిజన్‌ ప్రారంభం అవుతున్న తరుణంలో లూజ్‌ విత్తనాలను కొనుగోలు చేయరాదన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన దుకాణం ద్వారానే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో బోయలగూడెం, గట్టు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

లూజ్‌ విత్తనాలు కొనుగోలు చేయొద్దు..

శాంతినగర్ : ప్రభుత్వ సర్టిఫైడ్‌ లేని లూజ్‌ విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని వడ్డేపల్లి మండల వ్యవసాయశాఖ అధికారి రాధ సూచించారు. వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమొర్సు, మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో విత్తనాలు కొనుగోలు విషయమై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఏఓ మాట్లాడారు. గుర్తింపు పొందిన అధీకృత డీలర్‌ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కోయిల్‌దిన్నె, జక్కిరెడ్డిపల్లి, జిల్లెడుదిన్నె గ్రామాల్లో ఏఈఓల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారులు వినోద్‌ కుమార్, చంద్రకళ పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన

కేటీదొడ్డి: రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టపోతారని, లైసెన్స్‌ కలిగిన దుకాణాల్లో విత్తనాలు కోనాలని ఏఈఓ ప్రీతిసుధ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. లూజుగా ఉన్న సంచుల్లో విత్తనాలు కొనుగోలు చేయవద్దని, రైతులు తప్పనిసరిగ్గా గుర్తింపు పొందిన డీలర్‌ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలియజేశారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌ వినతి అందజేస్తున్న సాసనూల్లు రైతులు

మానవపాడు: ఎర్రవల్లి మండలంలోని సాసనూల్లులో రైతుల భూమి తమకు తెలియకుండా అన్యాక్రాంతం అయిందని, తాము 80 సంవత్సరాల కిందటి నుంచి 200 సర్వే నంబర్‌ని భూమిలో తాము, తమ వారసులమే శిస్తులో ఉన్నామని సాసనూల్లు నాయకులు శ్రీధర్‌రెడ్డి, శేషు, కుర్వ కృష్ణ రైతులు మద్దిలేటి, పరశురాం, కలెక్టర్‌ సంతోష్‌కు సోమవారం వినతి అందజేశారు. సాసనూల్లులోని 5.10 గుంటల రైతుల భూమిని ఎలాంటి అనుమతులు లేకుండా, పట్టాదారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రైతులు మద్దిలేటి, పరశురాంల భూమిని అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం, కర్నూల్‌ జిల్లాకు చెందిన వెంకటేశ్వరరెడ్డి పేరుపై ఖాతా మార్పు చేశారని, ఇది ఎలా జరిగిందో తెలియడం లేదని బాధితులు వాపోయారు. రైతులందరం కలిసి ఆన్‌లైన్‌లో చూసుకుంటే వెంకటేశ్వరరెడ్డి పేరు 200 సర్వే నంబర్‌లో వస్తుందని, సాసనూల్లు రైతుల భూమి రైతుల పేరుపై వచ్చేలా న్యాయం చేయాలని కలెక్టర్‌ కోరారు.

కాలిన పశుగ్రాసాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



ఉండవెల్లిలో దగ్ధమైన గడ్డివాములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఈ నెల 25న రాత్రి గడ్డివాములు దగ్ధమవడంతో సోమవారం ఎమ్మెల్యే విజేయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి, రైతుల కుటుంబాలను పరామర్శించారు. గడ్డివాములు రాత్రి సమయంలోనే ఇప్పటికీ ఆరు గడ్డి వాములు దగ్ధమవడంతో ఎమ్మెల్యేకు స్థానికులు సమస్యను తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే సోమవారం పరిశీలించి మాట్లాడారు. పాడి రైతులు గడ్డి వాములను రూ.వేలలో కొనుగోలు చేసుకుని పశువుల కోసం నిల్వ చేసిన మేత కాలిపోవడం చాలా బాధకరమని తెలిపారు. రైతులకు నష్టం రావడంతో ఈ సమస్యను ప్రభుత్వానికి తెలిపి నష్ట పరిహారం వచ్చేలా కృషి చేస్తామని బాధిత కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సుంకన్న, రాజశేఖర్, నాయకులు దామోదర్‌ రెడ్డి, శ్రీనివాసులు, కొండన్న, జనార్దన్‌ రెడ్డి, రజాక్, చిన్నరాముడు, శంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



అలంపూర్: ఎరువుల సంచుల లోడ్‌తో వెళ్తున్న ఆటోకు తృటిలో ప్రమాదం తప్పింది. చుట్టుపక్కల ఉన్న వారు ఆటోను పట్టుకోవడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్‌ నుంచి అలంపూర్‌ వైపునకు ఎరువల సంచులతో ఆటో వెళ్తుంది. అలంపూర్‌ చౌరస్తాలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వ స్వామి ఆర్చ్‌ గేట్‌ దాటే క్రమంలో(జాతీయ రహదారి ఫ్లైఓవర్‌ కింది భాగం తగ్గుగా ఉండటం, అలంపూర్‌కు మళ్లాల్సిన మార్గం ఎత్తుగా ఉండటం)తో ఆటో ముందు భాగం ఒక్కసారిగా గాల్లోకి తేలింది. అప్రమత్తమైన డ్రైవర్‌ ఆటోను నిలిపివేయగా.. అక్కడే ఉన్న వారు ఆటోను గట్టిగా పట్టుకొని దానిపైకి ఎక్కి కిందకు దించారు. అందరి సాయంతో ఆటోను రోడ్డు ఎక్కించారు. దీంతో ఆటో ప్రమాదం నుంచి బయటపడింది. బరువుతో వచ్చే వాహనాలకు ఇబ్బందులు లేకుండా ఎత్తుగా ఉన్న రోడ్డును తగ్గించాలని వాహనదారులు కోరుతున్నారు.